మ్యూజికల్ చైర్ పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో శనివారం 5వ రోజు మ్యూజికల్ చైర్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, కేజీబీవీ పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంధాలయ అధికారిని ఎస్.సునీత మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది కె.సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడుతున్న విద్యార్థులు

ఉమ్మడి విశాఖను.. కరువు ప్రాంతంగా ప్రకటించండి

-అధ్వాన రోడ్లును బాగు చేయండి
-జిల్లా పరిషత్ సమావేశంలో జెడ్‌పిటిసిలు డిమాండ్
-ప్రజా సమస్యలను లేవనెత్తిన సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : మంత్రి అమర్‌నాథ్

సమావేశానికి హాజరైన మంత్రి అమర్‌నాథ్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర, కలెక్టర్లు

ప్రజాశకి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఉన్నందున వ్యవసాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులకు కోలుకోని నష్టం జరిగిందని, దీనిని గుర్తించడంలో జిల్లా అధికారి యంత్రాంగం పూర్తిగా విఫలమైందని పలువురు జెడ్‌పిటిసిలు ఆవేదన చెందారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖలోని అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలను తక్షణం కరువు పీడిత జిల్లాలుగా ప్రకటించాలని, సహాయ చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధ్వాన రోడ్లును బాగు చేయాలని కోరారు. శనివారం ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్‌పి హాలులో జరిగింది. ప్రజా సమస్యలను జెడ్‌పిటిసిలు లేవనెత్తారు. రాష్ట్రంలో అనేక జిల్లాల్లో కరువు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం కేవలం 97 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం దుర్మార్గమని సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు విమర్శించారు. గిరిజన ప్రాంతంలోని మండలాల్లో కరువు లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పడం సరికాదన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో కరువు తీవ్రత ఏ స్థాయిలో ఉందో చూపిస్తానని, అధికారులు తనతో రావాలని డిమాండ్ చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కూడా గిరిజన మండలాల్లో కరువు తీవ్రంగా ఉందని చెప్పారు.

సిఎం దృష్టికి తీసుకెళ్తా : మంత్రి అమర్‌నాథ్

సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ మూడు జిల్లాలలో కరువు పరిస్థితులపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేసినందున ఆ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సిఎం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖను సమీక్షిస్తూ సెప్టెంబర్ మాసానికి సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదైనందున కరువు మండలాలుగా ఏయే ప్రాంతాలను ప్రకటించాలో ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నామన్నారు.

సమస్యలను లేవనెత్తుతున్న సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర వైద్య ఆరోగ్య శాఖను సమీక్షిస్తూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేసుకునే కొంతమంది గర్భిణులు, బాలింతలు ప్రభుత్వ ఆర్థిక సాయం రూ.6 వేలు అందక నష్టపోతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై దృష్టి సారించాలని వైద్యాధికారులను కోరారు. నాణ్యమైన విత్తనాలు లేక రైతులు నష్టపోతున్నట్లు తెలిసిందని, దీనిపై వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాని కోరారు.

సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు మాట్లాడుతూ అనంతగిరి మండలం నుంచి రోగులను ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేస్తే వైద్యం అనంతరం అత్యవసరమైతే 108 ద్వారా విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేయకుండా విజయనగరం పంపిస్తున్నారని, అక్కడ కూడా అత్యవసరమైతేనే కెజిహెచ్‌కు పంపుతున్నారని తెలిపారు. అలా కాకుండా ఎస్.కోట నుంచి నేరుగా 108లో కెజిహెచ్‌కు పంపే అనుమతులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందిస్తూ సమస్యను తక్షణం పరిష్కారం చేయాలని డాక్టర్ రాజేష్‌ను ఆదేశించారు. అనంతరం గంగరాజు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ అనంతగిరి మండలం వంకాయపాలెం ఎంపిపి పాఠశాల విద్యార్థులకు గ్రామంలోనే పాఠశాల ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బూరుగ, చినకోనిల, చిమిడివలస, తదితర గ్రామాలకు తక్షణం విద్యుత్ సరఫరా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాజుపాక నుండి డెక్కపూరం పటకదవడ రోడ్డు నిర్మాణానికి ఫారెస్ట్ అధికారులు అనుమతులు మంజూరు చేయాలన్నారు.

డ్వాక్రా రుణాల అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి : గంటా శ్రీరామ్

అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో డ్వాక్రా రుణాల అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని, బాధితులకు న్యాయం చేయాలని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గొర్రెలు పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. విఒఎ, సిసిని బాధ్యులు చేసి ఎపిఎం, ఎసి ధర్మారావు, బ్యాంకు అధికారులు తప్పించుకోవాలని చూస్తున్నారని తెలిపారు. రుణాల అవినీతిలో పలువురి అధికారుల పాత్ర ఉన్నందున పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించాలన్నారు. దీనిపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి స్పందిస్తూ అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైందని, దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

ప్రజాప్రతినిధులు కోరిన సమాచారం ఇవ్వాలి : విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రజాప్రతినిధుల ఫోన్లకు జిల్లా అధికారులు స్పందించడం లేదని కొందరు జెడ్‌పిటిసిలు లేవనెత్తిన అంశంపై విశాఖ జిల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ ఇకపై ప్రజాప్రతినిధులు కోరిన అంశాలకు సరైన సమాధానం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. పంచ గ్రామాల మరమ్మతుల కోసం గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నామన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణాధికారి ఎం.పోలినాయుడు, పలు శాఖల అధికారులు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, పలువురు జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

కరువు తీర్మానం ఆమోదం

ఉమ్మడి విశాఖ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతూ జిల్లా పరిషత్తు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

'ఆశా వర్కర్ల నియామకాల్లో పారదర్శకత ఏదీ'?

ప్రజాశక్తి-చింతపల్లి: ఆశా వర్కర్ల నియామకాలు పారదర్శకంగా జరగ లేదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ తెలిపారు. ఈ మేరకు తాజంగి ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశావర్కర్ పోస్టు భర్తీలో కేవలం నేటివిటీ సర్టిఫికెట్ ఇవ్వలేదన్న సాకుతో తక్కువ మెరిట్ ఉన్న వారిని నియమించడంపై రాజకీయ ఒత్తిడి ఉందన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని ఫైనల్ చేయకుండా వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం పాడేరులో జరిగిన స్పందనలో మెరిట్ వచ్చిన ఆమె తరపున కలెక్టర్, డీఎం అండ్ హెచ్ ఓలకు విన్నవించగా ఆశ వర్కర్ల ఇంటర్వ్యూ లోనే వెంటనే నేటివిటీ ఇవ్వక్కర్లేదని చెప్పారని, ఇదే విషయాన్ని తెలియజేస్తూ శనివారం తాజంగి వైద్య సిబ్బందికి తెలియజేశామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి శివ శ్రీనివాస్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజనులు దళారుల చేతిలో మోసపోకుండా జిల్లాలో ఎక్కడికక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుపై శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు సంబంధించిన తహశీల్దార్లు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, మిల్లర్లతో జెసితో పాటు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్ పరిధిలోని అడ్డతీగల మండలంలో 3, చింతూరులో 4, దేవిపట్నంలో 4, గంగవరంలో 4, చింతూరు 2, కూనవరంలో 4, మారేడుమిల్లిలో 1, రంపచోడవరంలో 6, రాజవొమ్మంగిలో 6, విఆర్.పురంలో 4, వై.రామవరంలో 4, ఎటపాక మండలంలో 5, మొత్తం 46 ధాన్యం కొలుగోలు కేంద్రాలు, పాడేరు డివిజన్లో 24 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతేడాది 28 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయగా, ఈ ఏడాది 30 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిపిఎస్ ట్యాగింగ్ ద్వారా ధాన్యం మిల్లులకు తరలిస్తామన్నారు. కొలుగోలు కేంద్రాలలో బయోమెట్రిక్ ఏర్పాటు చేశామన్నారు.

ఐటీడీఏ పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సబ్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ ధాన్యం కొలుగోలు కేంద్రాలను మండల తహశీల్దార్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. రైస్ మిల్లర్లు సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై మేనేజర్ గణేష్ కుమార్, డీఎస్ఓ శ్యాం కుమార్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్‌కెవి.చౌదరి, సావిత్రి, తహశీల్దార్లు శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, కె.సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దారు బి.రాజు, మండల వ్యవసాయశాఖ అధికారి లక్ష్మణ్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

సివిల్స్, గ్రూపు పరీక్షలకు 9 నెలలు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం, చింతూరు డివిజన్ పరిధిలోని గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన గిరిజన యువతి యువకులకు సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాలకు 9 నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి ఏర్పాటు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 6వ నుండి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 26న ఫస్ట్ లెవెల్ పరీక్ష నిర్వహించి, పాసైనవారి రిజల్ట్‌ను 28న ప్రకటిస్తామని చెప్పారు. సెకండ్ లెవెల్ పరీక్ష డిసెంబర్ 3న ఉంటుందని, 5న ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల నవంబర్ 21న హాల్ టికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫస్ట్, సెకెండ లెవెల్ పరీక్షల్లో పాసైన వారికి డిసెంబర్ 8, 9వ తేదీలలో రెండు రోజులపాటు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, 10వ తేదీన ఫైనల్ లిస్టు ప్రకటిస్తామని, అన్ని టెస్టులు, ఇంటర్వ్యూలలో ఉత్తీర్ణులైన వారికి డిసెంబర్ 15 నుండి క్లాసులు ప్రారంభించడం జరుగుతుందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.

ఊట నీటిని సేకరిస్తున్న కరకవలస గిరిజన మహిళలు

కరకవలసలో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి-అనంతగిరి: మారుమూల గిరిజన గ్రామాలకు తాగునీటి సదుపాయం కల్పిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది తప్పా ఆచరణలో అమలు కాలేదు. అనంతగిరి మండలం గుమ్మ పంచాయతీ పరిధి కరకవలస గ్రామంలో తాగునీటి సమస్యతో గిరిజన ప్రజలు అల్లాడుతున్నారు. గ్రామంలో తాగునీటి కుండి, బావి, బోరు, పైపులైన్ లేక పోవడంతో గ్రామస్తులు సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న కొండవాగు నుండి ఊట నీటిని తెచ్చుకుంటున్నారు. ఈ కలుషిత నీటిని తాగడంతో గిరిజనులు రోగాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పైపులైన్ ద్వారా గ్రామానికి నీటిని సరఫరా చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున పిఒ అభిషేక్

బిర్సాముండా విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆవరణలో భగవాన్ బిర్సాముండా విగ్రహాన్ని ఐటిడిఏ పిఒ వి.అభిషేక్ శనివారం ఆవిష్కరిం చారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు బిర్సాముండా, మన్యం వీరులు అల్లూరి సీతారామ రాజు, గాము మల్లుదొర, గాము గంటందొర, కొమరం భీం పేర్లతో ఐదు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన పోరాట యోధులను నిరంతరం గుర్తు చేసుకునే విధంగా వారి పేర్లతో మొక్కలు నాటుతున్నామని చెప్పారు. ప్రతీ ఒక్కరూ స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ బూరు వలస, అమనగిరి, నడుము వీధి తదితర గ్రామాల్లో కుళాయిలు, వాటర్ ట్యాంకులకు శనివారం బ్లీచింగ్ చేయించామని పంచాయతీ కార్యదర్శి పి.చిన్నారావు అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ కొర్ర సుజాత పాల్గొన్నారు.

బ్లీచింగ్ చేయిస్తున్న సెక్రటరీ

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాల్సిందే..

- లేకుంటే డిసెంబర్ 8 నుండి సమ్మె
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్
- పలు చోట్ల ర్యాలీలు,
ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నాలు

చింతూరులో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అల్లూరి జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాలు శనివారం ర్యాలీలు నిర్వహించారు. ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ప్రజాశక్తి-చింతూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన అంగన్వాడీలు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, అంగన్‌వాడీ టీచర్లతో సమానంగా మినీ వర్కర్లకు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్‌లో రాజకీయ జోక్యం అరికట్టాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, పెండింగ్లో ఉన్న సెంటర్ల అద్దెలు, బిల్లులు చెల్లించాలని, 2017 టీఏ బిల్లులు, ఇతర బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు ఇచ్చి ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని కోరారు. పై సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే డిసెంబర్ 8వ తేదీ నుంచి సమ్మెలో వెళ్తామని హెచ్చరించారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సూపర్వైజర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, నాయకులు కారం సుబ్బారావు, బీరబోయిన దిలీప్, అంగన్వాడీ వర్కర్లు వెంకటరమణ, జయ, వసంత, భద్రమ్మ, పార్వతి, దుర్గ, వీరమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని భీమవరం ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కొమరం పెంటయ్య మాట్లాడుతూ తెలంగాణ కన్న అదనంగా వేతనాలు ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షులు తాళ్లూరి శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ అధ్యక్షులు ప్రసన్న, కార్యదర్శి అన్నపూర్ణ, లలిత, అర్జమ్మ, రాణి, వరలక్ష్మి ముత్తమ్మ, అరుణ, సీపీఎం నాయకులు బాబురావు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండల కేంద్రం రేకపల్లి జంక్షన్ నుండి తహశీల్దారు కార్యాలయం వరకు అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా చేశారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దారు శ్రీధర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, యూనియన్ మండల కార్యదర్శి ముసురు రాజేశ్వరి, అధ్యక్షులు గంగమ్మ, జిల్లా నాయకులు సున్నం నాగమ్మ, వర్కర్లు పాల్గొన్నారు.

అడ్డతీగల : అంగన్వాడీ సమస్యలపై సిఐటియు జిల్లా కార్యదర్శి బి నిర్మల ఆధ్వర్యంలో శనివారం సిడిపిఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.బేబీ రాణి, కె.నాగవల్లి, కే సంతోష్‌వాణి, జె చంద్రకళ, లక్ష్మి, అప్పలరాజు, కమల, రామలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు మినీ అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షురాలు నిర్మల కుమారి, కార్యదర్శి ప్రసూన మాట్లాడుతూ ఆర్ఎఫ్ఎస్ రద్దు చేయాలని, మూడు యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు రాజన్న దొర, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు శనివారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యాలయం వద్ద సాయంత్రం వరకు బైఠాయించారు. ప్రభుత్వం తమ డిమాండ్ల తక్షణం పరిష్కరించాలంటూ నినదించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, యూనియన్ జిల్లా నాయకులు కె.వెంకటలక్ష్మి, మండల నాయకులు చిన్ని కుమారి, వి రమణి, బి సుందరమ్మ, హెచ్ గడ్డమ్మ, ఎల్ సత్యవతి, కె మంగమ్మ, చిన్నమ్ములు, యు రాజేశ్వరి,మేరీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కార్యకర్తల వినతి

ముంచింగిపుట్టు : మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు ఆధ్వర్యంలో శనివారం అంగన్వాడి కార్యకర్తలతో ఐసీడీఎస్ సూపర్వైజర్లకు వినతిని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అంగన్వాడిల సమస్యలు పరిష్కారం చేస్తానని చెప్పి మాట తప్పారన్నారు. అంగన్వాడి కార్యకర్తలకు, ఆయాలకు, మినీ వర్కర్లకు కనీస వేతనం 26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు సుజాత, బి సత్యవతి, చిలకమ్మ పాల్గొన్నారు.



విఆర్.పురంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

అడ్డతీగలలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న లయ కో-ఆర్డినేటర్ బుల్లియ

ఆదివాసీ వనమూలిక వైద్యుల సమ్మేళనం

ప్రజాశక్తి-అడ్డతీగల : ఆదివాసీ వన మూలిక వైద్యుల సమ్మేళనం మండల కేంద్రం అడ్డతీగలలోని లయ సంస్థ వనంతరం ఆదివాసీ మూలిక వనరుల కేంద్రం వద్ద శనివారం జరిగింది. పార్వతీపురం, సీతంపేట, పాడేరు, రంపచోడవరం ఐటిడిఏ ఏరియాల నుండి సుమారు 200 మంది మూలిక వైద్యులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. వనమూలిక వైద్యం అంతరించిపోతుందని, దీనికి ప్రాచుర్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యులు పేర్కొన్నారు. వనమూలిక వైద్యాన్ని పెంపొందించడం ద్వారా ఆదివాసీలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వనమూలిక వైద్యులు వాడుతున్న ఔషధ మొక్కలు, దుంపలు విత్తనాలు, సుమారు 400పై చిలుకు ఔషధ మొక్కలను ప్రదర్శనలో పెట్టారు. ఈ ఎగ్జిబిషన్ తిలకించడానికి వివిధ కాలేజీల నుండి అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పజాశక్తి-రాజవొమ్మంగి : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టినట్లు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని బడదనాంపల్లి పంచాయతీలో గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమం సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు పథకాల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగకుండా సచివాలయం, వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గడపగడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, మండల తహశీల్దారు సుబ్రమణ్య ఆచారి, సీఐ షేక్ బాజీ లాల్, రాజవొమ్మంగి ఎస్ఐ ఎస్ వెంకయ్య, పలువురు సర్పంచులు ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


మహిళలకు కరపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

మూఢనమ్మకాల నిర్మూలన సంఘం ఇన్‌ఛార్జిగా రాంబాబు

కిల్లో రాంబాబు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: మూఢనమ్మకాల నిర్మూలన సంఘం అల్లూరి జిల్లా ఇన్చార్జి నియామకం శనివారం జరిగింది. జిల్లా కేంద్రం పాడేరులో నిర్వహించిన నియామక సమావేశంలో ఈ ఎంపిక చేపట్టారు. సమావేశంలో సంఘం కార్యాచరణ, మూఢనమ్మకాల నిర్మూలన కోసం చేపట్టాల్సిన ప్రణాళిక, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం జిల్లా నూతన ఇన్చార్జ్ నియామక కార్యక్రమం జరిగింది. జిల్లా ఇంచార్జ్‌గా ఉపాధ్యాయుడు కిల్లో రాంబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని సభ్యులు, నాయకులు, శ్రేయోభిలాషులు తనతో కలిసి నడవాలని, సహకరించాలని కోరారు. ఎంఎన్ఎస్ ఆశయ సాధనలో భాగంగా మూఢనమ్మకాల నిర్మూలన, సమాజ చైతన్యం కోసం కృషి చేయాలని తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా, నిస్వార్థంగా నిబద్ధతతో తనకు అప్పగించిన బాధ్యతను నెర వేరుస్తానన్నారు. సంఘం బలోపేతానికి, సమాజ మార్పు కోసం కృషి చేస్తానన్నారు. ఇన్చార్జిగా నియమించినందుకు సంఘం వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు బైరి నరేష్, జాతీయ సమన్వయకర్త ఉపాధ్యాయురాలు సుజాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ప్రారంభమైన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శనివారం పాడేరు, అరకు, రంపచోడవరం మండలాల్లో కొనసాగింది. వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన ప్రజలకు కల్పిస్తున్నారు. పాడేరు మండలంలో నోడల్ అధికారి, ఎంపిడిఒ కె.సాయి నవీన్ ఆధ్వర్యంలో శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. వాడపల్లి బడిమెలలో కేంద్ర ఆరోగ్య శాఖకు చెందిన ప్రతినిధులు స్థానికులకు వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి జమాల్ భాషా వైద్యారోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. మొలికల్లు గ్రామంలో రైతులకు డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిటిసిఒ డాక్టర్ టి.విశ్వేశ్వరరావు, ఎస్ఒ డాక్టర్ కైలాస్, కేంద్ర ఆరోగ్య శాఖ ప్రతినిధులు డాక్టర్ అనీల్ పాల్గొన్నారు.

అరకువేలీ మండలం కొత్తబల్లుగూడలో నోడల్ అధికారి, ఎంపిడిఒ సిహెచ్ వేంకటేష్ ఆధ్వర్యంలో పథకాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కె.రాధిక, పిహెచ్ సి వైద్యాధికారి కిరణ్మని, ఎపిఎం అప్పయమ్మ పాల్గొన్నారు. రంపచోడవరం మండలం జరగాం పల్లె, ఫోక్సు పేట, బీరంపల్లి, పూట్ల గ్రామాల్లో నోడల్ అధికారి, ఎంపిడిఒ బి హరికృష్ణ ఆధ్వర్యంలో పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవోపిఆర్‌డి జాన్ మిల్టన్, ఐటిడిఎ పిఎఒ డాక్టర్ మధన్, కెవికె సైంటిస్టు డాక్టర్ లలిత, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘం వారోత్సవాలు

జెండాను ఆవిష్కరిస్తున్న చైర్మన్ రామకృష్ణ

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరణ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యులుగా రైతులు చేరి అన్ని రకాల రాయితీలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ కిల్లో రామకృష్ణ, వైఎస్సార్ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, ఎంపీటీసీ భీమలింగేశ్వరరావు, కొప్పుల లక్ష్మయ్య, సీఈఓ అప్పలనాయుడు, జోగేశ్వరరావు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

జెవిడి సంయుక్త ఖాతాలకు పడిగాపులు

విద్యా,వసతి దీవెనకు ప్రభుత్వ కొత్త నిబంధనతో బ్యాంకుల వద్ద బారులు తీరిన విద్యార్థులు, తల్లులు

పాడేరులోని ఓ బ్యాంకు వద్ద పడిగాపులు పడుతున్న విద్యార్థులు, తల్లులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాల కింద ఇచ్చే ఆర్థిక సాయం ఇక నుంచి జమ కావాలంటే విద్యార్థులు, తల్లి సంయుక్తంగా ఖాతా తెరవాల్సిందేనని ప్రభుత్వం నిబంధన విధించింది. దీంతో, వీరు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్ని కావు. నూతన నిబంధనలతో అవస్థలకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరంతా బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. విద్యార్థి తల్లి సంయుక్త ఖాతాలు మాత్రమే రుసుము జమ చేస్తామని ప్రభుత్వం నిబంధన విధించడంతో బ్యాంకుల చుట్టూ పరుగులు తీస్తున్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని పలు బ్యాంకులు విద్యార్థులు, తల్లులతో కిటకిటలాడుతున్నాయి. ఇంటర్మీడియట్ తర్వాత తదితరత ఉన్నత విద్యకు సంబంధించిన కోర్సులు చేరిన వారికి విద్యా దీవెన పథకం ద్వారా బోధన రుసుములను విద్యార్థుల తల్లుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తోంది. పథకం పొందాలంటే తల్లులతో బ్యాంకు సంయుక్త బ్యాంకు ఖాతా తెరవాలన్న కొత్త నిబంధనతో మైదాన, దూర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు సొంత గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో కళాశాలల్లో రోజువారి జరిగే వివిధ ప్రాజెక్ట్ వర్క్‌లను పక్కన పెట్టి వెళ్లాల్సి వస్తోందంటూ విద్యార్థులు వాపోతున్నారు. ప్రయాణం నిమిత్తం నగదు ఖర్చవుతుండంతో తల్లిదండ్రులకు ఆర్థికంగా భారమవుతోందని అంటున్నారు. గతంలో ఫీజ్ రియంబర్స్మెంట్ కింద విద్యార్థులకు సంబంధించిన బోధన రుసుములను ఆయా కళాశాలలకు ప్రభుత్వమే నేరుగా చెల్లించేది. ఇప్పటి ఈ విధానం ఇబ్బందికరంగా ఉండడంతో పాత విధానమే మేలని పలువురు తల్లిదండ్రులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాలయాలకు చెల్లించాల్సిన ఫీజులను ఓట్ల కోసం తల్లుల ఖాతాల్లో వేస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఒకేసారి వందలాదిమంది బ్యాంకుల బాట పట్టడంతో రద్దీ ఏర్పడి ఇతర ఖాతాదారులకూ అవస్థలు తప్పడం లేదు.

ఉమ్మడి ఖాతా ఉత్తర్వులు రద్దు చేయాలి : ఎస్‌ఎఫ్ఐ

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు తల్లి ఖాతాతో విద్యార్థికి కూడా ఉమ్మడిగా బ్యాంక్ అకౌంట్ ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. దీనిని భారత విద్యార్థి ఫెడరేషన్ అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ విషయంపై శనివారం పాడేరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.జీవన్ కృష్ణ, పి.చిన్నారావు మాట్లాడుతూ, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు ప్రారంభం నుండి తల్లి ఖాతాలో నిధులు జమ చేస్తున్నారని అన్నారు. కొత్తగా విద్యార్థిని కూడా చేర్చి జాయింట్ అకౌంట్ చేయడంతో కొత్తగా వచ్చే ప్రయోజనం ఏమటని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రభుత్వం విద్యాదీవెన పథకంలో నాలుగు దఫాలలో చివరి దఫా గత రెండు సంవత్సరాలు అమలు చేయలే దన్నారు. వసతి దీవెన 20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి 10 వేలు మాత్రమే ఇస్తుందన్నారు. . దీంతో రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 1600 కోట్ల రూ. మిగల్చుకుందని అన్నారు. ఇవన్నీ చూస్తుంటే కొత్తగా పెట్టిన నిభంధన కూడా పథకాల్లో కోతలు విధించేందుకే అని స్పష్టంగా అర్థం అవుతుందని విమర్శించారు. పథకాలు అమలు చేయడంలో చిత్తశుద్ధి లేకుండా కోతలు చేసి నిధులు మిగిల్చుకోవడం సిగ్గుచేటన్నారు. కొత్త నిభందనతో ప్రయోజనం లేకపోగా అనేక నష్టం జరుగుతుందని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ అకౌంట్ నిబంధనను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 1600 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు.

కార్మికులకు ప్రొఫెషనల్ ట్యాక్స్ నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : కార్మికుల జీతాల నుంచి కోత కోస్తున్న ప్రొఫెషనల్ ట్యాక్స్‌ను నిలుపుదల చేయాలని గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మకు సిపిఎం 79వ వార్డు కార్యదర్శి వి.వెంకటరమణ శనివారం వినతిపత్రం అందజేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిధిలో 16 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఎక్కువమంది కార్మికులు నిర్వాసితులేనని, స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ఇళ్లు, భూములు త్యాగం చేసి ఉద్యోగాల రాక ఇప్పటికీ కూలి పనులతోనే నెట్టుకు వస్తున్నారని వివరించారు. ఓ పక్క ఇంటి పన్ను, చెత్త పన్ను, నీటి పన్ను, వసూలు చేస్తూనే కాంటాక్ట్ కార్మికులపై ప్రొఫెషనల్ టాక్స్ పేరుతో నెలకు రూ.200, రూ.300 వసూలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని నెట్టుకురావడమే భారంగా ఉన్న తరుణంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా పన్నులపై పన్నులు వేసి కార్మికులు నడ్డి విరుస్తున్నారన్నారు. తక్షణమే కలుగజేసుకొని కార్మికుల నుంచి కట్ చేసిన ప్రొఫెసనల్ ట్యాక్స్‌ను నిలుపుదలచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, రాజా పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రమణ

22న సిఐటియు సమావేశం

ప్రజాశక్తి- చింతపల్లి: పాడేరులో ఈనెల 22న సిఐటియు జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు. బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. చింతపల్లిలో వారు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులల జీతాలు పెరగలేదన్నారు.ఆర్థిక భారం కార్మికుల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. రానున్న ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని పోరాటాలను బలోపేతం చేసే దిశగా రూపకల్పన చేయనున్నట్లు చెప్పారు.

జంతువుల ఎన్‌క్లోజర్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఒసిఎల్) సహకారంతో నూతనంగా నిర్మించిన నాలుగు జంతువుల ఎన్‌క్లోజర్లను శనివారం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు మధుసూధనరెడ్డి, ఐఒసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ కుమార్ వాసుదేవన్‌తో కలిసి ప్రారంభించారు. జూ పార్కులో జంతువుల ఎన్‌క్లోజర్ల నిర్మాణానికి నిధులు సమకూర్చిన సెర్పల్, ఐఒసిఎల్ యాజమాన్యానికి సిసిఎఫ్ అభినందనలు తెలిపారు. వైజాగ్ జూ అభివృద్ధికి మరింత సహాయ సహకారాలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని సెర్పల్, ఐఒసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాసుదేవన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా, డిసిఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాల నాయుడు, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు భారతి, రాజేశ్వరరావు, జూ వెటర్నరీ వైద్యుడు ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ లేని క్లినిక్స్‌పై చర్యలు

సీతమ్మధార : రిజిస్ట్రేషన్ లేని ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఫెర్టిలిటీ కేంద్రాలపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ -2002 ప్రకారం చట్ట పరమైన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నడుస్తున్న ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ -2002 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా https://clinicalestact.ap.gov.in/, స్కానింగ్ కేంద్రాలకు https://pcpndt.ap.gov.in/ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

తూర్పు కనుమల జీవ వైవిధ్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పిఎం పాలెం : కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యం పరిధిలో ఉన్న పిఎంపాలెం నర్సరీ ప్రాంగణంలో పర్యాటకుల సందర్శన కోసం కొత్తగా రూపుదిద్దుకున్న తూర్పు కనుమల జీవ వైవిధ్య కేంద్రాన్ని (ఈస్టర్న్ ఘాట్స్ బయో డైవర్సిటీ సెంటర్) శనివారం రాష్ట్ర ముఖ్య అటవీ సంరక్షణాధికారి మధుసూధనరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అడవుల సంరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించడంతో పాటు పర్యాటకంగా ఆకర్షించే విధంగా అటవీశాఖలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దివీస్ లేబొరేటరీస్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థలు అందించిన సిఎస్ఆర్ నిధుల సంయుక్త సౌజన్యంతో కేంద్రాన్ని తీర్చిదిద్దామన్నారు. తూర్పు కనుమల్లోని అరకు, పాడేరు తదితర ప్రాంతాలతో పాటు ఇతర ప్రదేశాల నుంచి తెచ్చిన పలు రకాల మొక్కలతో అవి పెరిగే వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి ఆర్కిడారియం ఏర్పాటుచేశామని చెప్పారు. వీటితో పాటు ఆరోగ్య, నక్షత్ర వనాలు, గ్రంథాలయం, ఆహ్లాదకరమైన వనం తదితరాలు ఇక్కడ అందుబాటులో ఉంచామన్నారు. దీని సందర్శనకు ధర నిర్ణయించి త్వరలో సందర్శకులకు అనుమతి కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐఒసిఎల్ సంజయ్‌కుమార్ వాసుదేవన్, దివీస్ జనరల్ మేనేజర్ ఎమ్ఎస్ఎన్.రావు, గవర్నమెంట్ లైజెన్ కన్సల్టెంట్ వరహాలరెడ్డి, సిఎస్ఆర్ మేనేజర్ దేవళ్ళ సురేష్ కుమార్, విశాఖ సర్కిల్ అటవీ ప్రధాన సంరక్షణాధికారి ఎస్.శ్రీకాంతనాథరెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి అనంతశంకర్, జూ క్యూరేటర్ నందనిసలారియా, సబ్ డిఎఫ్ఓ ధర్మరక్షిత, అటవీ రేంజ్ అధికారులు బి.రామనరేష్, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన భీమిలి సన్ స్కూల్‌లో శనివారం జరిగిన నెట్ బాల్ పోటీల్లో భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు తెలిపారు. 14 ఏళ్లలోపు పురుషుల విభాగంలో జి జస్వంత్, పి.చందు, బాలికల విభాగంలో బి.శ్రావణి, స్టాండ్ బైగా బి.వైశాలి ఈ నెల 19న కృష్ణా జిల్లా నిడుమనూరులో పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.

రంపలో నిరసన తెలుపుతున్న టిడిపి, జనసేన నాయకులు

అధ్వాన రోడ్లపై టిడిపి, జనసేన నిరసనలు

ప్రజాశక్తి-రంపచోడవరం

తెలుగుదేశం జనసేన పార్టీల రాష్ట్ర ఉమ్మడి కార్యాచరణ గుంతల ఆంధ్రప్రదేశ్‌కి దారేది కార్యక్రమంలో భాగంగా శనివారం టిడిపి మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేష్, జనసేన టిడిపి ఉమ్మడి కార్యక్రమాల నియోజకవర్గం అధ్యక్షులు కుర్లా రాజశేఖర్ రెడ్డితో ఆధ్వర్యాన రంప గ్రామం అధ్వాన రోడ్డుపై నిరసన కార్యక్రమం చేపట్టారు. రహదారిలో గుంతలను, పాడైపోయిన బ్రిడ్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో వేసిన రోడ్లు తప్ప వైసిపి ప్రభుత్వంలో కొత్త రోడ్లుకాదు కాదా, కనీసం గుంతలను కూడా పూడ్చి లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి ఈ రోడ్లు బాగు చేయాలి, గుంతలను పుడ్చాలని, కొత్త రోడ్లు వేయాలని, బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు కారం సురేష్ బాబు, పాపుల శ్రీను, పెంటపాటి అనంత మోహన్, గోర్లే సునీత, సిద్దా వెంకన్న దొర, ఆకుల జయరాం, కొనతం శ్రీనివాస్, డాక్టర్ వర్మ పాల్గొన్నారు.

విఆర్.పురం : విఆర్.పురం మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్డుపై టిడిపి, జనసేన పార్టీల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు మాట్లాడుతూ మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు బురక కన్నారావు, సవలం రాజేంద్రప్రసాద్, కేచ్చెల పోసిరెడ్డి, బాగుల అంజన్ రావు, మడకం రాజు, సోడే గంగాధర్ గోల్కొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు జాయింట్ అకౌంట్ ఉత్తర్వులు రద్దు చేయాలి

ప్రజాశక్తి-చింతూరు : విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు తల్లి ఖాతాతో విద్యార్థికి కూడా ఉమ్మడిగా బ్యాంక్ అకౌంట్ ఉండాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల మాజీ కార్యదర్శి పోడియం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు ప్రారంభం నుండి తల్లి ఖాతాలో నిధులు జమ చేస్తున్నారని, ఇప్పుడు కొత్తగా విద్యార్థిని చేర్చి జాయింట్ అకౌంట్ చేయడం వలన వచ్చే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రభుత్వం విద్యా దీవెన పథకంలో నాలుగు దఫాలలో చివరి దఫాగా రెండు సంవత్సరాలు అమలు చేయలేదన్నారు. ఇవన్నీ చూస్తుంటే పథకంలో కోతలు వీధించడానికే కొత్త కొత్త నిబంధనలు పెడుతున్నట్లు అర్థమవుతుందన్నారు.

పుస్తకాలు, క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని కొత్తకాలనిలో ఉన్న జిపిఎస్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, శానిటైజర్స్, స్పోర్ట్స్ కిట్స్, ఇతర సామాగ్రిని జెడ్‌పిటిసి గొర్లె బాలాజీ బాబు ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అనేక వసతులు, సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు చక్కగా విద్యను అభ్యసించచి ఉన్నత శిఖరాలను అవరోధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, ఉపాధ్యాయులు దూడ పిబే, సాదల శైలజ విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఏం చేశారని మళ్లీ జగన్ కావాలి?

మాట్లాడుతున్న బోరయ్య

ప్రజాశక్తి -కూనవరం

వైసిపి ప్రభుత్వం గిరిజనులకు ఏమి చేసిందని మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ కావాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి బాబు బోరయ్య ప్రశ్నించారు. మండల కేంద్రంలో శనివారం పాయం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో బోరయ్య మాట్లాడుతూ జిఒ 3ని అమలు చేయనందుకా? బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చినందుకా? పీసా, 1/70 చట్టాలు అమలు చేయనందుకా? ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఇవ్వనందుకా, 5వ షెడ్యూల్ ఏరియాల్లో గిరిజన యువతకు ఉద్యోగాలు లేకుండా చేసినందుకా? గిరిజనులకు సాగు-తాగు నీరుకు నిధులు ఇవ్వనందుకా? మళ్ళీ జగన్ రావాలి అని ప్రశ్నించారు. నాలుగున్నరేళ్లగా డిఎస్‌సి తీయలేదని, కొండ ప్రాంతాల్లో పాఠశాలలు పెట్టలేదని, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉన్న టీచర్లను తొలగించి కొండరెడ్లకు విద్యను దూరం చేసిందని, లక్షలాదిమంది గిరిజనులు ముంపునకు గురవుతున్న ఆర్ అండ్ ఆర్, భూమి ప్యాకేజీ ఇంకా ఇవ్వలేదని తెలిపారు. వీటిపై వైసీపీలో ఉన్న గిరిజనులు కూడా ఆలోచించాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు సీతారామయ్య, మడకం జ్యోతి, సోడే శంకర్, మడెం బాబు, నుపా రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు

ఆసక్తిగా సాగుతున్న పోటీలు

ప్రజాశక్తి-విఆర్.పురం

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా కూనవరం హైస్కూల్‌లో శనివారం చిత్రలేఖనం, వ్యాసరచన వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు చంద్రావు, కారం రత్తయ్య, జి.పుష్పలత, కెవి.రమణ, ఎస్.సత్యనారాయణ, సిహెచ్.రాజేశ్వరి, విజయ సాధన ఉపాధ్యాయులు ఎస్.అనంత కుమారి, బలియార్ సింగ్, రమేష్ బాబు సమక్షంలో, గ్రంథాలయాధికారి ఎం.గోవిందరాజులు ఆధ్వర్యాన ఈ పోటీలు జరిగాయి. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం బహుమతుల ప్రదానం ఉంటుందని గ్రంథాలయాధికారి తెలిపారు. కార్యక్రమంలో సత్యారపు నాగరాజు, సూదిపాక శ్రీనివాస్, నోముల సాయి మహేష్ పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు

- తీరంలో క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ చూసేందుకు భారీ స్క్రీన్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న క్రికెట్ వరల్డ్ కప్ - 2023 ఫైనల్ మ్యాచ్‌లో ఆదివారం భారత్, ఆసీస్ తలపడుతున్న నేపథ్యంలో ఆ మ్యాచ్‌ను క్రీడాభిమానులు వీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ విశాఖ ఆర్‌కె బీచ్‌లో పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. తీరంలో మూడు స్క్రీన్లు ఏర్పాటు చేయడమే కాకుండా ఫుడ్ కోర్టులనూ పెడుతోంది. దీంతో విశాఖ నగర ప్రజలు, చుట్టుపక్కల ప్రాంతాల వారు భారీగా తరలివచ్చే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుండి బీచ్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నామని విశాఖపట్నం డిసిపి - 1 శ్రీనివాసరావు తెలిపారు. పార్క్ హోటల్ జంక్షన్ నుంచి నోవోటల్ జంక్షన్ వరకు బీచ్ రోడ్డు గుండా ఎటువంటి వాహనాలనూ అనుమతించమని తెలిపారు. శనివారం ఉదయం పోలీస్ కమిషనర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌కె బీచ్‌లో క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించడానికి ఎంవిపి.కాలనీ, అప్పుఘర్, చినవాల్తేరు మీదుగా వచ్చే వాహనదారులు ఎంజిఎం గ్రౌండ్‌లో వారి వాహనాలను పార్కు చేసుకోవాలన్నారు.

సిరిపురం సిఆర్ రెడ్డి మీదుగా ఆర్‌కె బీచ్‌కి వెళ్లే వాహనదారులు ఎయు ఇంగ్లీష్ మీడియం స్కూల్ జంక్షన్ నుంచి వెళ్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వాహనాలను పార్క్ చేసుకోవాలన్నారు. సిఆర్.రెడ్డి, ఆల్ ఇండియా రేడియో జంక్షన్ మీదుగా ఆర్‌కె బీచ్‌కు వెళ్లే వాహనదారులు తమ వాహనాలను ఎపిఐఐసి గ్రౌండ్‌లో పార్కు చేసుకుని తీరానికి చేరుకోవాలన్నారు.

1200 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని సురేంద్రపాలెం గ్రామం శివారులో నాటుసారా తయారీ బట్టీలపై దాడులు నిర్వహించి, నాటు సారా తయారీకి ఉపయోగించే 1200 లీటర్ల బెల్లం పులుపును కొయ్యూరు సిఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు ఎస్సై రాజారావు తెలిపారు. తమకు అందిందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి సురేంద్ర పాలెం గ్రామ శివారులో ఉన్న నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించామని చెప్పారు. ఈ దాడుల్లో బెల్లం పులుపుతో పాటు, నాటుసారా తయారు చేసే వంట సామాగ్రి, నిల్వ ఉంచే డ్రమ్ములను, తయారు చేసే బట్టీలను ధ్వంసం చేశామని వెల్లడించారు. నాటుసారా తయారు చేస్తున్న సురేంద్ర పాలెం గ్రామానికి చెందిన వారిని త్వరలో గుర్తిస్తామన్నారు. ఎవరైనా నాటుసారా తయారీ, క్రయ విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భవిష్యత్ గ్యారెంటీపై ప్రచారం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని దూసర పాము గ్రామంలో శనివారం బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఆరు మినీ వాగ్దానాలతో కూడిన బాండ్లను టిడిపి, జనసేన నేతలు ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు దంతులూరి శివ రామచంద్రరాజు, బోదిరెడ్డి త్రిమూర్తులు, ఎంపీటీసీ నల్ల సత్యనారాయణ, ముప్పన కేశవ్, కనిగిరి శ్రీను, మఠం భాస్కర్, కారం సురేష్ కుమార్, మాకాడ బుల్లెమ్మ, ముప్పన సావిత్రి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు తుది గడువు 30

ప్రజాశక్తి - సీలేరు : ఇంటర్మీడియట్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులు మార్చిలో పరీక్షలు రాసేందుకు ఈనెల 30వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సాయిరాం వెల్లడించారు. ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 2021 నుంచి 2022 వరకు పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్ష ఫీజు నిర్ణీత గడువులోపు చెల్లించాలన్నారు. మార్చిలో జరగబోయే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో పాల్గొనేందుకు చక్కటి అవకాశమని, దీన్ని విద్యార్థులు సద్వినియం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్ శ్రీనివాసు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - రంపచోడవరం : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన రంపచోడవరం మండలం బందపల్లి గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫస్ట్ క్లాస్ జుడీషియల్ మేజిస్ట్రేట్, చైర్మన్ బి.ప్రవీర్ వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యాంటీ ర్యాగింగ్ యాక్ట్, పోక్సో చట్టం, రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్, ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్, దిశ చట్టం, లోకాయుక్త, ఎన్‌డిపిఎస్ చట్టాలపై తెలియజేశారు. బాలురు మంచి నడవడికతో లక్ష్యానికి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎవి.సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ప్రయోగశాలను, బాలుర వసతి గృహాన్ని న్యాయమూర్తి తనిఖీ చేశారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని తామరపల్లి పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన సిసి రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఎంపీపీ బందం శ్రీదేవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంపై ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు ఎంతో శ్రద్ధ పెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, వైసిపి మండల కన్వీనర్ జల్లెపల్లి రామన్నదొర, జెసిఎస్ కన్వీనర్ పండా రామకృష్ణ, సర్పంచ్ మిర్తివాడ ఆనంద్ రెడ్డి, ఎంపీటీసీ వంశి కుంజం పాల్గొన్నారు.

20న గాజువాకలో కార్మిక, రైతు సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 27, 28 తేదీలలో విజయవాడలో అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మహాధర్నా జరుగనున్న నేపథ్యంలో దానికి సన్నద్ధంగా గాజువాకలో ఈ నెల 20న ఉమ్మడి విశాఖ జిల్లా సదస్సు జరుగుతుందని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు